పూడిక తొలగింపు గాలికి!


ఎంవీపీ కాలనీ సెక్టార్-12 లాసన్స్ బే కాలనీలో గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు


సెక్టార్-7లో గెడ్డలో వ్యర్థాల కారణంగా నిలిచిపోయిన మురుగునీరు

- గెడ్డల్లో భారీగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఎంవీపీ కాలనీ: గెడ్డల ఆధునికీకరణపై జీవీఎంసీ యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయి. ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. గతంలో వీటిని పెద్ద ఎత్తున ఆధునికీకరించారు. అయితే ప్రతి ఏటా కనీసం రెండు పర్యాయాలు గెడ్డల్లో పేరుకుపోయే వ్యర్థాలు తొలగింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రక్రియపై జీవీఎంసీ యంత్రాంగం దృష్టిసారించ లేదు. గెడ్డలన్నీ వ్యర్థాలతో అధ్వానంగా తయారయ్యాయి. ఆయా గెడ్డలను ఆనుకొని ఉంటున్న నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు. మలేరియా, డెంగ్యూ, తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అధికారులు ఇలా గెడ్డలను గాలికి వదిలేయడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వర్షా కాలం వచ్చినా చర్యలు శూన్యం

ముడసర్లోవ నుంచి ఆరిలోవ మీదుగా హనుమంతవాక, ఎంవీపీ కాలనీ వైపు ప్రవహించే పలు గెడ్డలు లాసన్స్ బే కాలనీ ప్రాంతంలో సముద్రంలో కలుస్తున్నాయి. ఎంవీపీ కాలనీలో ముఖ్యంగా అంజయ్యనగర్, సెక్టార్-7, సెక్టార్-3, సెక్టార్-11 ప్రాంతాల మీదుగా ఈ గెడ్డలు ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు వాటి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. గతంలో కోట్ల రూపాయల నిధులతో దశల వారీగా ఈ గెడ్డలను ఆధునికీకరించిన విషయం తెలిసిందే. అడుగు భాగంతో పాటు చుట్టూ కాంక్రీట్ గోడలు నిర్మించడంతో గతంలో కంటే పరిస్థితి మెరుగుపడింది. వ్యర్థాలను క్రేన్ల సాయంతో ఏటా తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనా జీవీఎంసీ గెడ్డల్లో వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వర్షపు నీరు ఎక్కడి అక్కడే నిల్వ ఉండి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా వ్యర్థాలు తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి

వ్యర్థాలు గెడ్డల్లో పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అంజయ్య నగర్ ప్రాంతం మధ్య గుండా పెద్ద గెడ్డ ప్రవహిస్తుంది. అయితే గత కొంత కాలంగా ఈ గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వ్యర్థాలతో కూడిన మట్టి మేటలు వేయడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం కారణంగా సమస్య మరింత పెరగకముందే వ్యర్థాలు తొలగించాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నాం.

– లక్ష్మి, అంజయ్యనగర్

క్లుప్తంగా

కూరగాయల సాగుపై అవగాహన


ఎంవీపీ రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారులు

ఆరిలోవ: జిల్లా ఉద్యాన శాఖాధికారులు మంగళవారం ఎంవీపీ కాలనీ రైతుబజార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో జరిగిన సమావేశంలో ఆ శాఖాధికారులు కె.సత్యనారాయణరెడ్డి, జి.సోని మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు, పువ్వులు, తదితర పంటల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు తెలియజేశారు. పంట సాగులో తీసుకున్న జాగ్రత్తలతోనే మంచి దిగుబడి సాధించి, లాభాలు పొందడానికి వీలుపడుతుందని సూచించారు. ఈ సమావేశంలో ఉద్యానవన విభాగం విస్తరణాధికారి సురేష్, రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సహాయకుడు జి.నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కరించాలి


హోం మంత్రి అనితకు వినతి పత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫారం ఇన్‌చార్జి రామారావు

ఆరిలోవ: ఎస్టీ, ఎస్సీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి నేషనల్ ఇన్‌చార్జి పారిపల్లి రామారావు కోరారు. ఈ మేరకు మంగళవారం విశాఖ కేంద్ర కారాగారం సందర్శించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్‌లో సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు.

15వ వార్డులో 'ఏక్ పెడ్ మా కే నామ్'


మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

మద్దిలపాలెం : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన 'ఏక్ పెడ్ మా కే నామ్'(అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో జీవీఎంసీ 15వ వార్డులో మంగళవారం నిర్వహించారు. హెచ్‌బీ కాలనీలోని ఉక్కు కళావేదిక సమీపంలోని పార్కులో వార్డు బీజేపీ అధ్యక్షుడు కనకాల పాపారావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బుగత సత్యనారాయణ, జనసేన వార్డు అధ్యక్షురాలు యడ్ల కళ, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల విజేతలకు అభినందనలు

మహారాణిపేట : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ముగ్గురు, ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీలో 12 మంది, గ్రూప్-2 ప్రిలిమినరీలో 80 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ నుండి 2024 జూన్ వరకు వారికి శిక్షణ ఇచ్చామని, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ కె.హర్షవర్ధన్, డైరెక్టర్ విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసన్ ఎంతో సహకరించారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రామారావు అభినందించారు.

ప్రజా రక్షణే అగ్నిమాపక శాఖ ధ్యేయం


రక్షణ పరికరాలను అందిస్తున్న హిందుస్తాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి

మురళీనగర్: ప్రజల ప్రాణాల రక్షణ ధ్యేయంగా అగ్నిమాపక శాఖ పని చేస్తుందని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఆర్.నిరంజన్‌రెడ్డి అన్నారు. బర్మా క్యాంపు కాలనీలోని మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్షణ సమయంలో సిబ్బంది స్వీయ రక్షణ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ప్రజలను విపత్తుల నుంచి రక్షించడంలో సిబ్బంది సేవలు విలువైనవని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది రక్షణ కోసం హిందుస్థాన్ కోలోస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.7లక్షలు విలువ చేసే రక్షణ సామగ్రిని అందించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కౌశిక్, ప్రతాప్, ఏవీఎస్ రావులను అగ్నిమాపక కేంద్రం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి రేణుకయ్య, మర్రిపాలెం, సూర్యాబాగ్, పెదగంట్యాడ, చిట్టివలస అగ్నిమాపక అధికారులు కేవీటీ ప్రసాదరావు, పి.సింహాచలం, ఎం.గోపీకృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బావికి శతాబ్ది వేడుకలు


బావి వద్ద శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్న వెంకోజీపాలెం గవరవీధి వాసులు

మద్దిలపాలెం : వందేళ్ల నాటి ఓ బావికి గ్రామస్తులు వినూత్నంగా శతాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలు జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం గవరవీధిలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో 1923 జూలై 2న నీటి బావిని ప్రారంభించారని తెలిపారు. బావి వద్ద కేక్ కట్ చేశారు.

మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలకు ఆహ్వానం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యూహోప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూహోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర-2024 పోటీలు త్వరలో నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ మేరకు ప్రచార పోస్టర్లను మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ జరిగే ఈ పోటీల్లో పాల్గొనదలచిన ఉత్తరాంధ్ర జిల్లాల మహిళలు 73370 97256 ఫోన్ నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిస్ ఉత్తరాంధ్ర విన్నర్ శ్రేయ, మిస్ విజయనగరం భాగ్య, ఉత్తరాంధ్ర విన్నర్ లక్ష్మి, న్యూహోప్ డైరెక్టర్ సిద్ధు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహి నవరాత్రులు


శ్రీలలితా పీఠంలో కొలువైన వారాహి అమ్మవారు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు సహస్రనామ అర్చన, అనంతరం వారాహి హోమం చేస్తామన్నారు. వారాహి దేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, భూసంబంధిత వ్యవహారాల పరిష్కారం, శత్రునాశనం, పంటలు పరిరక్షణ, ప్రయోగ బాధల నుంచి విముక్తి, ఆరోగ్యం, మానసిక సమస్యల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. నవరాత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గీతా పఠనంతో ఆధ్యాత్మిక వైభవం


ప్రత్యేక పూజలు చేస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వ శాంతిని కాంక్షిస్తూ వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతా భవన్‌లో మహిళలచే సామూహిక సంపూర్ణ గీతా పారాయణ, విష్ణు సహస్రనామాలు, హనుమాన్ చాలిసా పారాయణ సాంప్రదాయ రీతిన నిర్వహించారు. గీతా ప్రచార సమితి, భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీభాయి మహిళా శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాన్ని గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతను పఠించడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యంతో కూడిన మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. భారత్ వికాస్ పరిషత్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. గత 25 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక వైభవానికి నిస్వార్థ సేవలందిస్తున్న చావలి విశ్వేశ్వరరావును భారత్ వికాస్ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్రస్థాయి ప్రతినిధి ఎంవీ రాజశేఖర్, విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, జీఎస్‌వీ మాణిక్యాలరావు, పి. షర్మిల, వనజ, శారద, మంజుల, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీ నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు భూసేకరణ కార్యాలయంలో నోటీసు బోర్డు వివాదం



భూసేకరణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

గాజువాక: విశాఖ ఉక్కు భూసేకరణ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ కార్యాలయానికి ఏదైనా పని నిమిత్తం వచ్చే వ్యక్తులు స్వయంగా గాని, వారి రక్త సంబంధీకులు గాని అయి ఉండాలని, మధ్యవర్తులకు, దళారులకు ప్రవేశం నిషిద్ధమని ఆ బోర్డులో పేర్కొన్నారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అందులో హెచ్చరించారు. దీనిపై నిర్వాసిత కాలనీలకు చెందిన పలువురు నాయకులు, సమాచార హక్కు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులను కలవడానికి వెళ్తామని, అయినంతమాత్రాన నాయకులను, సమాచార హక్కు కార్యకర్తలను దళారులుగా భావిస్తారా అని వ్యాఖ్యానిస్తున్నారు. భూసేకరణ కార్యాలయంలో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారి వివరాలపై ఆరా తీస్తున్నందుకు సిబ్బంది ఈ విధంగా బోర్డును ఏర్పాటు చేశారని అంటున్నారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిపై స్థల ఆక్రమణ ఆరోపణ వచ్చిందని, దీనిపై ప్రశ్నిస్తుండటంవల్లే ఇలాంటి చర్యలకు కార్యాలయ అధికారులు ఉపక్రమించారని ఆరోపిస్తున్నారు.

బాలిక అదృశ్యం


తప్పిపోయిన బాలిక హారిక

అల్లిపురం : గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదని ఆమె సోదరి జగదీ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 28వ తేదీ ఉదయం 11.30 గంటల సమయంలో ఎదురింటి ఆంటీతో గుడికి వెళ్లి వస్తానని వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో వారు నగరంలో పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన బాలిక ఆచూకీ తెలిస్తే 89198 12412, 9440904716 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని తెలిపారు.

'ఉక్కు' రక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి


నారాయణకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. విశాఖలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో పాల్గొనడానికి వచ్చిన నారాయణను కలిసి, ఇక్కడి పరిస్థితిని వివరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే వేలాదిమంది రోడ్డున పడతారని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్, కె.రాజబాబు తదితరులున్నారు.

మూడు తులాల బంగారం చోరీ

బీచ్ రోడ్డు: ఇంట్లో దాచుకున్న మూడు తులాల బంగారం అపహరణకు గురైందని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీబీఎం కాంపౌండ్‌కు చెందిన మార్టిట్ సతీష్ గత నెల 12న కొత్త పని మనిషిని పెట్టుకున్నారు. గత నెల 26వ తేదీ నుంచి ఆమె పని చేయడానికి రావడం లేదు. మంగళవారం ఇంట్లో బీరువా చూసేసరికి మూడు తులాల బంగారం కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ దుకాణాలకు 9న వేలం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-8 పరిధి పెందుర్తి వాణిజ్య సముదాయంలో 2 దుకాణాలకు బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సముదాయంలో గల ఆయా దుకాణాలను మూడేళ్ల కాల పరిమితికి వేలం ద్వారా ఇచ్చేందుకు ఈ నెల 9 ఉదయం 11 గంటలకు జోన్-8 కార్యాలయంలో నిర్వహించనున్న బహిరంగ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయ పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

నయనానందకరం.. సురభి భూకైలాస్



భూకైలాస్ నాటకంలో సన్నివేశాలు

మద్దిలపాలెం : గత సురభి నాటకోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం భూకైలాస్ నాటకం ప్రదర్శన అద్భుతంగా సాగింది. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో బాదంగీర్ సాయి నేతృత్వంలో జరిగిన ఈ ప్రదర్శనను ఏయూ రంగస్థల విభాగం అధ్యాపకుడు డాక్టర్ మీగడ శశిభూషణస్వామి ప్రారంభించారు. శ్రీభానోదయ నాట్య మండలి(సురభి) హైదరాబాద్ బృందం సభ్యులు ఈ నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశాఖ రచయిత సంఘం కార్యదర్శి అడపా రామకృష్ణ, సహృది సాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన్న, సూర్యనారాయణ, హస్య ప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు, జ్యోతి సరళ నాటక పరిషత్ అధ్యక్షుడు అప్పలనాయుడు, సాయి కళా నికేతన్ గౌరవ అధ్యక్షుడు గంటా అప్పలనాయుడు, రంగస్థల నటి సంధ్యా, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యా పితామహుడు రాంరెడ్డి సేవలు చిరస్మరణీయం


రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ ధర్మారావు, తదితరులు

ఎంవీపీకాలనీ: దూరవిద్యా పితామహుడు, ఇగ్నో వ్యవస్థాపక కులపతి ఆచార్య జి.రాంరెడ్డి ఇగ్నో అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు అన్నారు. రాంరెడ్డి 29వ స్మారకోపన్యాస కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని యువత అంతా చదువుకోవాలనే లక్ష్యంతో ఆచార్య రాంరెడ్డి దూరవిద్యా విధానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఉన్నత విద్యను సామాన్యులకు చేరువ చేయడంలో, దేశ వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేయడంలో ఆయన ప్రత్యేక భూమిక పోషించారన్నారు. అనంతరం రామరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం ఉపసంచాలకుడు డాక్టర్ ఇ.కృష్ణారావు, పూర్వ సంచాలకుడు డాక్టర్ రాజారావు, విభాగాధికారి వీవీ పతిరావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకన్న కల్యాణం


ఆకట్టుకున్న అంబరిల్లా డ్యాన్స్


వెంకటేశ్వరస్వామి పల్లకి ఊరేగింపు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కొలువైన వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక హారతులు, దూపదీప నైవేద్యాలతో పూజలు చేశారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా తిరువీధి

కల్యాణ మహోత్సవంలో భాగంగా వెంకటేశ్వర స్వామి, పద్మావతిల తిరువీధి మహోత్సవం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు కనుల పండుగగా సాగింది. వెంకటేశ్వర కాలనీ, నందగిరి నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి నీరాజనాలు పలికారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లు, గొడుగుల డ్యాన్స్, కేరళ బ్యాండు, కోయ డ్యాన్స్, వెంకటేశ్వస్వామి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి.

నూతన న్యాయ చట్టాలపై అవగాహన అవసరం


న్యాయ చట్టాలపై సచివాలయం పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార : నూతన న్యాయ చట్టాలపై సచివాలయం పోలీసులకు అవగాహన అవసరమని ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు సూచించారు. చట్టాలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. జూలై 1 నుంచి మారిన సెక్షన్లు, బాధితుల హక్కుల పరిరక్షణకు తీసుకొచ్చిన కొత్త చట్టాలపై వివరించారు. మీ పరిధిలో ఎటువంటి నేరాలు జరిగినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. సచివాలయ పరిధిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి అవగహన కల్పించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేనివారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 సచివాలయాల పోలీసులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.